క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పెదకూరపాడు: భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్నింగ్ స్టార్ అధినేత జవాది సతీష్ అన్నారు. పెదకూరపాడులో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో సతీష్ సహకారంతో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను బుధవారం పంపిణీ చేశారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. విరివిగా చెట్లు నాటుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. ఏఎస్ఐ రాంజీనాయక్ మాట్లాడుతూ యువత పర్యావరణ పరిరక్షణకై కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ వెన్ని బాబు, కోఆర్డినేటర్ వెలు తోటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ కాలనీలో చోరీ

రాజుపాలెం: మండలంలోని కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో గుత్తా రమేష్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీకి తెగబడ్డారు. ఇంటి యజమాని గుత్తా రమేష్, భార్య వెంకటలక్ష్మి వేరే ఊరికి పనిపై వెళ్లారు. ఇంటిలోని పిల్లలు పై అంతస్తులో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి బీరువా పగలగొట్టి 4 సవర్ల బంగారం, రూ.20 వేల నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వేణుగోపాల్ బుధవారం ఇంటిలోని బీరువాను పరిశీలించి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి త్వరలో నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

అచ్చంపేట: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చింతపల్లిలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లికి చెందిన అరిగెల అఖిల(26) ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చింతపల్లికి చెందిన వలేషుతో అఖిలకు ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈమె పుట్టినిల్లు తాళ్లచెరువు. ఆరేళ్లుగా సంతానం కలగలేదు. ఇరువురు తరచు గొడవలు పడుతుండేవారని, ఈ క్రమంలోనే బుధవారం కూడా గొడవపడినట్లు తెలిసింది. మృతురాలి తల్లిదండ్రులు మాత్రం తమ కుమార్తెను అల్లుడే హత్య చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి తరలించారు.

స్వమిత్వ సర్వేకు సహకరించండి

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్వమిత్వ స్కీమ్ ద్వారా గ్రామాల్లో ప్రజల (అబాదీ) ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు హక్కుదారులకు పట్టాలిచ్చేందుకు జరుగుతున్న సర్వే కార్యక్రమానికి సంబంధించి గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వేలో పాల్గొనే ఐదుగురు సభ్యుల అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీరాజ్ అధికారి నాగేశ్వరరావు నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్ పాల్గొన్నారు. డీపీఆర్వో సర్వే గురించి పలు సూచనలు చేశారు. మండలంలో రెండవ విడత పైలైట్ ప్రాజెక్ట్ కింద 12 గ్రామాలు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటన్నిటిలో ఏరియా మ్యాప్ కొరకు ఈపాటికే డ్రోన్‌ను ఎగుర వేసినట్లు చెప్పారు. వీటికి సంబంధించిన పీపీఎం, ఓఆర్ఐ నివేదికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వే అసిస్టెంట్ పాల్గొని సమగ్రంగా సర్వే చేపడతారన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఇంటి స్థల కొలతలు వేసి ఆన్‌లైన్ చేసిన అనంతరం పూర్తి స్పష్టతతో తహసీల్దార్ ద్వారా పక్కా డాక్యుమెంట్ అందచేయటం జరుగుతుందన్నారు. ప్రజలు ఇళ్ల వద్దే ఉండి సర్వేకొరకు వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 12 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు సర్వే అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ముందుగా మండలంలోని దొడ్లేరు గ్రామాన్ని డీపీఆర్వో సందర్శించి అక్కడి పారిశుధ్య కార్యక్రమాలు, పరిశీలించారు. ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు చేయాలని కోరారు. స్థానిక ప్రజలతో పంచాయతీ సమస్యలపై మాట్లాడారు.



కొమెరపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, పక్కన గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి



కొమెరపూడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ఆందోళన



కొమెరపూడిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళాలు వేస్తున్న బాధితులు



ఆందోళనను బలవంతంగా విరమింపజేస్తున్న పోలీసులు

షిఫ్ట్ ఆపరేటర్ల ఆందోళన

మాకు న్యాయం చేయకపోతే పురుగుమందు తాగి ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని సత్తెనపల్లి మండలం కొమెరపూడి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తొలగించబడిన షిఫ్ట్ ఆపరేటర్లు గురువారం శాంతియుత ఆందోళన చేశారు. షిఫ్ట్ ఆపరేటర్ల న్యాయమైన, శాంతియుత ఆందోళనకు వైఎస్సార్‌సీపీ సంఘీభావం ప్రకటించింది. - సత్తెనపల్లి

పంట పొలాలను కాపాడాలి



నకరికల్లు: చేపల చెరువు నీళ్లు రావడంతో ముంపుకు గురవుతున్న పంట పొలాలను కాపాడాలని పలువురు రైతులు విన్నవించారు. చల్లగుండ్ల గ్రామానికి చెందిన రైతుల పొలాలు చీమలమర్రి గ్రామ సమీపంలోని చేపల చెరువు నీళ్లతో ముంపుకు గురవుతున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె.పుల్లారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ సుమారు 20 మంది రైతులకు చెందిన సుమారు 35 ఎకరాలు నీట మునిగాయని, దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. చేపల చెరువు నిర్వాహకులు సరైన నిబంధనలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పొలాలు నీట మునిగాయని అధికారులు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో షేక్ జాకీర్‌హుస్సేన్, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, రైతు సంఘం నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి, చట్టు కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఏకదంతాయ.. వక్రతుండాయ..

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- భక్తి శ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

సత్తెనపల్లి: వినాయక చవితి ఉత్సవాలు సందడిగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా కొలువుదీరిన గణపతి విగ్రహాలు బుధవారం నుంచి ప్రత్యేక పూజలు అందుకుంటున్నాయి. బహురూపాల్లో దర్శనమిస్తున్న ఏకదంతుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తరిస్తున్నారు. పలుచోట్ల ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు నిర్వహించారు. వినాయకుని కరుణాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని మండలం రెంటపాళ్లలో, పట్టణంలోని ఒకటవ వార్డులో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విఘ్నేశ్వరుడికి తొలి పూజ చేశారు. ఆయనతో పాటు ఆయన సతీమణి డాక్టర్ ప్రియాంక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, అయ్యప్ప రెడ్డి, సాయి, షేక్ జలీల్, గుంటూరు జానీ, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. వినాయకుని మట్టి విగ్రహాలను, పత్రిని పట్టణంలోని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో గురువారం కొందరు నిమజ్జనం చేశారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాలలో వాడవాడలా వినయకుని విగ్రహాలను నెలకొల్పారు. మండలంలో మొత్తం 84 విగ్రహాలు ఏర్పాటు చేశారు. గ్రామ గ్రామాన వినాయక మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మండలంలోని చామర్రు, కోనూరు కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. నిమజ్జన స్థలంలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో చవితి వేడుకలను బుధవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. మండలంలోని బెల్లంకొండ, చంద్రాజుపాలెం, నాగిరెడ్డిపాలెం, పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, కండిపాడు, నందిరాజుపాలెం గ్రామాలలో అధిక సంఖ్యలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండపాలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 52 వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసినట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు. మాదల గ్రామంలో ఏకంగా 12 వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అపశృతులు లేకుండా నిమజ్జనం సాగేలా గుంటూరు బ్రాంచి కాలువ, పెదనందిపాడు బ్రాంచి కాలువ వద్ద ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజుపాలెంలో...



రెంటపాళ్లలో డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి, డాక్టర్ ప్రియాంక దంపతులు

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చలువ పందిళ్లల్లో గణనాథులను కొలువుదీర్చి వివిధ రంగులతో అలంకరించారు. రాజుపాలెంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం బజారులో 5 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మూడు, ఐదు, తొమ్మిది రోజులు పూజలు నిర్వహించిన అనంతరం అనుపాలెం పెద్ద కాలువ, బలిజేపల్లి సమీపంలోని ఎద్దు వాగు, ఇనిమెట్ల సమీపంలోని ఎస్ఎస్‌బీ కెనాల్‌లో నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అమరావతి, గోవిందపురం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేసేవారు ప్రత్యేకంగా పోలీసువారి అనుమతులు తీసుకోవాలని చెప్పారు.

అమరావతిలో...

అమరావతి: మండల పరిధి గ్రామాలలో అన్ని కూడళ్లలో బుధవారం గణపతి నవ రాత్రోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ప్రతి గ్రామంలోను పందిళ్లు వేసి గణపతి పూజలను నిర్వహించారు. అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరాలయంలో వేకువ జామునే స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే ధరణికోట సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి, కోదండ రామస్వామి దేవస్థానంలో గణపతి పూజలు నిర్వహించారు. ధరణికోటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి కోటేశ్వరరావు పాల్గొని పూజలు నిర్వహించారు.

క్రోసూరులో...

క్రోసూరు: వినాయక చవితి పండుగను బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అనంతవరం గ్రామంలో సహృదయ సేవా సంస్థ అధ్యక్షుడు పట్టీల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మట్టి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసారు. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా ఆ సంస్థ గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



సత్తెనపల్లి పెద్దబొడ్డురాయి సెంటర్‌లో...



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదురు బజార్‌లో వినాయకుడు, 50 కేజీల శివలింగాకార లడ్డు



రాజుపాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానం బజారులో...

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు



వినాయకుని శోభాయాత్ర



శోభాయాత్రలో భారీ శివుని విగ్రహం


పెదకూరపాడు : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. వాడవాడలా గణనాథులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదకూరపాడు మహాలక్ష్మీ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం ఆకట్టుకుంది. భక్తులు భారీ ఎత్తున శోభాయాత్రను నిర్వహించారు. శోభాయాత్రలో శివుని భారీ విగ్రహం ఆకట్టుకుంది. కళాకారులు వేషధారణలు, నృత్యాలతో గణనాథుడు అమరావతి నిమజ్జనానికి తరలి వెళ్లాడు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై గిరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలనను పంపిణీ చేశారు.



అమరేశ్వరాయలంలోని వినాయక ఉపాలయంలో...



ధరణికోటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోటేశ్వరరావు



నాగిరెడ్డిపాలెంలో...



ముప్పాళ్ళ రామాలయం వద్ద...



అచ్చంపేట పాలకేంద్రం వద్ద...

విద్యుత్ బిల్లులపై ధ్వజమెత్తిన ప్రజాసంఘాలు



విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



ముప్పాళ్ళలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు



క్రోసూరులో...

నకరికల్లు: విద్యుత్ బిల్లులను భారీగా పెంచుతూ స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విద్యుత్ విధానాలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్‌కలాం సెంటర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ హయాంలో విద్యుత్ ఉద్యమం చేస్తూ కాల్పుల్లో వీరమరణం పొందిన అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు ఈవూరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలను రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ విధానాలు వెనక్కు తీసుకోకుంటే ఉద్యమం బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, సీఐటీయూ మండల కార్యదర్శి గోదా వెంకటరమణ, కోటేశ్వరరావు, జాకీర్‌హుస్సేన్, మల్లారెడ్డి, వినుకొండ మస్తాన్‌వలి, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి దరియావలి, మెట్టిల కోటేశ్వరరావు, సయ్యద్ రణ్‌హుస్సేనీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మరో ఉద్యమం



ప్రతిజ్ఞ చేస్తున్న చలమయ్య, నాయకులు

సత్తెనపల్లి: బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ స్థానిక సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి సీఎం చంద్రబాబు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ముగ్గురు మృతి చెందారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో నేడు కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మరోసారి ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, నాయకులు కట్టా శివ దుర్గారావు, గద్దె ఉమాశ్రీ , పొట్టి సూర్యప్రకాశరావు, ఇంజం లింగయ్య, పంతంగి ప్రభాకర్, జడ రాజకుమార్, రజిని, సుధా, సాయిబా, హరిపోతురాజు, చంద్రశేఖర్, ఆంజనేయులు, సదానందరావు, వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

శాఖాపరమైన లక్ష్యాలు సాధించాలి

నకరికల్లు: శాఖాపరంగా నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి.రామారావు ఆదేశించారు. నకరికల్లు, రొంపిచర్ల మండలాల్లోని పశుసంవర్ధక శాఖ, సిబ్బందికి గోపాలమిత్రలకు స్థానిక పశు వైద్యశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాంకెట్ సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసాల సాగు, పశువులలో ఎస్ఎస్ఎస్ వీర్యం వాడుక తదితర అంశాలపై సమీక్షించారు. పశువుల దాణా తయారీని రైతులకు ప్రతి గ్రామ సచివాలయంలో వివరించాలన్నారు. వివిధరకాల బహువార్షిక గడ్డి జాతుల పెంపకం గురించి క్రిందిస్థాయి సిబ్బందికి శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో నకరికల్లు ఏడీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు నాయక్, పశు వైద్యులు డాక్టర్ వంశీ, డాక్టర్ సుజాత, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ సాయిమహేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ



మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ

సత్తెనపల్లి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ అన్నారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సమన్వయంతో అన్ని శాఖల అధికారులు పని చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం గ్రామాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య అధికారి డాక్టర్ గౌతమి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా ఉంటే ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని అందుకు తగ్గ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్ మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సహకారంతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలోని 14 గ్రామాల్లో స్వామిత్వ సర్వే జరుగుతున్నట్లు వెల్లడించారు. స్వర్ణపంచాయత్ పోర్టల్‌లో ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు విలువల విద్య అనే పుస్తకాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనంలో మంచి నాణ్యత కలిగిన సన్న బియ్యంను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో అన్ని పాఠశాలలకు ఆల్కలైన్ మంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రతి నెల మూడవ శనివారం నో బ్యాగ్ డే విధానాన్ని పాటిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.